# పోలింగ్ నిర్వహణకు సిద్ధం కావాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేశ్, అదనపు కలెక్టర్లు

- అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలి
- పోలింగ్ ప్రక్రియకు సిద్ధం కావాలి
- వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 7 : శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు అన్ని విధాలుగా సిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారులకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులపై సంగారెడ్డి కలెక్టర్, ఎస్పీ తదితరులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 10వ తేదీతో ముగియనున్నందున, పోలింగ్ నిర్వహణ కోసం ఈవీఏంలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఇప్పటికే మొదటి ర్యాండమైజేషన్ ద్వారా ఈవీఎంలను శాసనసభ నియోజకవర్గ కేంద్రాలకు తరలించామని, ఈ నెల 18న రెండో ర్యాండమైజేషన్ నిర్వహించాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పత్రాల ముద్రణలోనూ ఎలాంటి తప్పులు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అభ్యర్థులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గంలో, వారి సంఖ్యకు అనుగుణంగా ఈవీఎంలను వినియోగించాలని సూచించారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి చేయాల్సిన పనులు, చేయకూడనివి ఏమిటనే అంశాలపై పోలింగ్ విధుల్లో పాల్గొంటున్న వారందరికీ స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస, మౌలిక సదుపాయాలు ఉండాలని, బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వెబ్ క్యాస్టింగ్‌కు ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారు.

**తనిఖీలో పూర్తి పారదర్శకత పాటించాలి**

వాహనాల తనిఖీ సమయంలో పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. సువిధ యాప్ ద్వారా ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాలకు వచ్చే దరఖాస్తులను పరిశీలిస్తూ నిబంధనలకు లోబడి ఉన్నవాటికి గడువులోగా అనుమతి ఇవ్వాలన్నారు. తిరస్కరించిన కారణాలను స్పష్టంగా తెలియజేయాలన్నారు. 1950 టోల్ ఫ్రీ, సీ విజిల్, కంట్రోల్ రూమ్‌ల ద్వారా వచ్చే ఫిర్యాధులపై తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి శరత్, ఎస్పీ రూపేశ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, అదనపు ఎస్పీ అశోక్, నోడల్ అధికారులు, డీఆర్వో నగేశ్, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

# ఇంటింటి ప్రచారం

- బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- సీఎం కేసీఆర్ హామీలపై అవగాహన
- మాణిక్‌రావు భారీ మెజార్టీతో గెలిపించాలి
- న్యాల్‌కల్ బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం

న్యాల్‌కల్, నవంబర్ 7 : ప్రజల అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని జడ్పీటీసీ స్వప్నాభాస్కర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్ పిలుపునిచ్చారు. న్యాల్‌కల్ మండలంలోని ఖలీల్‌పూర్, న్యామతాబాద్, మిర్జాపూర్(బీ) తదితర గ్రామాల్లో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ, కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచిస్తున్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి, సబ్బండ వర్గాల సంక్షేమానికి కేసీఆర్ భరోసాగా ఉన్నారన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. ప్రజా నాయకుడు బీఆర్ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గౌసుద్దీన్, ఆత్మకమిటీ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, భాస్కర్, బక్కారెడ్డి, మాణయ్య, సుధాకర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, వినోద్‌కుమార్, భూమయ్య పాల్గొన్నారు.


మిర్జాపూర్(బీ)లో బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు


ఖలీల్‌పూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# సరిహద్దు చెక్‌పోస్టుల్లో తనిఖీలు


కోహీర్ : సిద్ధాపూర్ తండా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కోహీర్/ న్యాల్‌కల్, నవంబర్7: మండలంలోని మనియార్‌పల్లి గ్రామ శివారుతో పాటు సిద్ధాపూర్ తండా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యం లో అక్రమంగా మద్యం, డబ్బు రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు తనిఖీలను నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మనియార్‌పల్లి, సిద్ధాపూర్ తండా సమీపంలోని కర్ణాటక హద్దులో చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. తెలంగాణలోకి ప్రవేశించే కార్లు, బైకులను పోలీసులు, ఎక్సైజ్‌శాఖ సిబ్బంది నిరంతరం తనిఖీ చేస్తున్నారు. అక్రమంగా మద్యం, డబ్బు తరలిస్తే కేసు నమోదు చేస్తున్నారు. వాహనాల తనిఖీల్లో పోలీసులు పాల్గొన్నారు.

## హుస్సేల్లిలో నగదు పట్టివేత

న్యాల్‌కల్ మండలంలోని హుస్సేల్లి గ్రామ శివారులోని తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద నగదును పట్టుకున్నట్లు హద్నూర్ ఎస్సై రామానాయుడు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం కర్ణాటకలోని బాల్కి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారును చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేయగా రూ.66,200 నగదు పట్టుబడింది. పట్టుబడిన డబ్బుకు సంబంధించి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశారు. డబ్బులు తీసుకెళ్లేటప్పుడు ఆధారాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు.



కోహీర్ : మనియార్‌పల్లి గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

# జహీరాబాద్‌లో 4 నామినేషన్లు

జహీరాబాద్, నవంబర్ 7 : జహీరాబాద్ శాసనసభ స్థానం నుంచి పోటీ చేసేందుకు పలువురు అభ్యర్థులు తయ నామినేషన్లను మంగళవారం జహీరాబాద్‌లోని రిటర్నింగ్ అధికారికి అందజేశారు. బీజేపీ అభ్యర్థిగా రాంచందర్, స్వతంత్ర అభ్యర్థిగా బి.రాములు, బహుజన ముక్తి పార్టీ అభ్యర్థిగా చంద్రకాంత్, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా మ్యాథరి మహేందర్ తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డికి అందజేశారు.

# పటాన్‌చెరులో ఐదు నామినేషన్లు

ఐదుగురు అభ్యర్థులు తమ నామినేషన్ల పత్రాలను రిటర్నింగ్ ఆఫీసర్ దేవుజాకు అందజేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా మన్నె రాములు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సీ) నుంచి నీలం మధుముదిరాజ్ పేరున ఆయన భార్య నామినేషన్ వేశారు. భారతీయ జనతాపార్టీ (బీజేపీ )నుంచి టి.నందీశ్వర్‌గౌడ్ కుటుంబ సభ్యులు నామినేషన్ దాఖలు చేశారు. ధర్మసమాజ్‌పార్టీ నుంచి అన్నెల లక్ష్మణ్, ఇండిపెండెంట్‌గా ఖాదర్ మోహినుద్దీన్ నామినేషన్ వేశారు. ఇప్పటివరకు 14 మంది నామినేషన్లు వేశారు. వీరిలో ఒకరు పార్టీ అభ్యర్థిగా, ఇతరులు ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు.

## ఉచిత కరెంటుతో మేలు



మాలాంటి వాళ్ల కోసం సీఎం కేసీఆర్ సార్ ఆలోచించి ఉచిత కరెంటు పథకాన్ని అమలు చేయడం మేలుజేస్తున్నది. గతంలో మా దుకాణానికి వెయ్యి రూపాయల వరకు కరెంటు బిల్లు వచ్చేది. ఇప్పుడు 250యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. దీంతో మాకు అసలు బిల్లు రావడం లేదు. అసలు కరెంటు చార్జీల పైసలు కట్టడం అవసరం లేకుండా పోయింది. దీంతో ఆర్థికంగా మాకు ఫాయిదా జరుగుతున్నది. నాయీబ్రాహ్మణులకు ఇంత మంచి పథకాన్ని తేవడం బాగున్నది. ఉమ్మడి రాష్ట్రంల మమ్మల్ని ఎవలు పట్టించుకోలె. ఇప్పుడైతే మా నాయిబ్రాహ్మణులను సర్కారు మంచిగ జూసుకుంటున్నది. గతంల కంటే మా గిరాకీ కూడా మంచిగ అయితున్నది. రాత్రి వరకు దుకాణాలు నడుపుతున్నాం. రెండింతల ఆదాయం అస్తున్నది. తెలంగాణ అచ్చినంక సౌలత్‌లు మంచిగైనయి. కరంట్ అచ్చిదంటే పోవడమే లేదు. కరెంట్ 24 గంటలు ఉంటుండడంతాని దుకణంలో ఫ్యాను ఏసుకుని షాప్ మంచిగ నడుపుతున్నం. తెలంగాణ రాక మునుపు గిట్ల కరెంటే ఉండకపోతుండే. పొద్దుగాళ్ల పోతే రాత్రి అస్తుండే. రోడ్లు కూడా మంచిగైనయి. రోడ్ల పొంట మస్తు చెట్లు పెట్టిర్రు. ఊర్లు శుభ్రంగ అయినయి. తెలంగాణల అందరికి మంచిగనే ఉన్నది.

**- శివ, కటింగ్ షాప్, కవేలి, కోహీర్ మండలం.**

## బీమాతో పేదలకు భరోసా ఉంటది



పేద కుటుంబాలకు ఆదుకునేందుకు ప్రభుత్వం ఎన్నో హామీలు ఇస్తున్నది. సీఎం కేసీఆర్ సార్ చెప్పినట్లు ఇంటింటికి ఇన్సురెన్స్ ఇస్తే పేద కుటుంబాలకు ఎంతో భరోసా ఉంటది. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వమే రూ. 5 లక్షల ఇన్స్‌రెన్స్ ఇవ్వడం మంచి నిర్ణయం. సీఎం కేసీఆర్ సార్ ఇస్తున్న రైతుబంధుతో రైతులకు పెట్టుబడి తిప్పలు లేదు. రైతుబీమాతో భార్య, పిల్లలు రోడ్డున పడకుండా ఆదుకుంటున్నది. రైతుబీమా ఇచ్చినట్లే రేషన్ కార్డు ఉన్న కుటుంబానికి ఇన్స్‌రెన్స్ ఇస్తామని కేసీఆర్ సార్ అనడం బాగుంది.

**- శశికళ , గృహిణి, హద్నూర్, న్యాల్‌కల్ మండలం.**

## కేసీఆర్ సారు పేదల పక్షపాతి..



ఇంటింటికీ కేసీఆర్ బీమా పథకం ఇస్తే పేదలకు ధీమా ఇస్తుంది. బీమా పథకాన్ని అమలు చేస్తామని సీఎం కేసీఆర్‌సారు చేర్చడం చాలా సంతోషం. రైతుబీమా పైసలు భూమి ఉన్న రైతులకు మాత్రమే వచ్చేవి. కానీ, సీఎం కేసీఆర్ మంచి మనసుతో ఆలోచించి ప్రతి ఒక్కరికీ బీమా కల్పిస్తామని చెప్పారు. ఇది నిరుపేదలకు ధీమా ఇస్తుంది. సీఎం కేసీఆర్ పేదల పక్షపాతి అని మరోసారి నిరూపించారు. పదవులు ఉంటాయి పోతాయి.. పేదల గురించి ఆలోచించే వారే నాయకుడు. కేసీఆర్ సార్ నిజమైన నాయకుడు. కేసీఆర్ సారు ఇస్తానంటే కచ్చితంగా అమలు చేస్తడు.

**- మొల్లయ్య, బీఆర్ఎస్ నాయకుడు, పైడిగుమ్మల్**